# వడ్రంగి పిట్ట

నేనంటే నాకే అపరిమితమైన ప్రేమ. నా అంత అందమైంది వుంటుందా అన్న ఆలోచనే ఎప్పుడూ. స్నానం చేస్తున్నప్పుడు నా వొంటిలావణ్యం చూసు కుంటాను. అద్దంలో మెడవొంపులోని గ్రేస్ చూసుకుంటాను. వొంటికి పౌడర్ అద్దుకుంటూ నా వేతివేళ్ళకున్న మెత్తదనం చూసుకుంటాను. self love, self love దీన్నే ఇంగ్లీషులో Narcism అంటారట.

ఓహ్ Lovely Blue bird, Beautiful Blue bird నా పేరు Blue bird. నేను పారిస్‌లో సీన్‌నది ఒడ్డున పుట్టానని నాన్న చాలా సార్లు చెప్పాడు, సెకెండ్ వరల్డ్‌వార్ ముగిసిన మర్నాడో మూడోనాడో పుట్టానట. తీరుబడిగావుంటే—తాను చిన్నప్పుడు పడిన కష్టాలగురించి చెబుతాడు. యుద్ధంలో అనుభవాలు చెబుతాడు.

ఈ ఇరవయ్యేళ్ళలోనూ నేనూ మానాన్నా తప్ప నాకు మరెవ్వరూ తెలీదు నా రెండో ఏట మా అమ్మ చచ్చిపోయిందట. మా అమ్మ చాలా చాలా అందంగా వుండేదట. నాకు ఐదారేళ్ళ వయసులో ఇండియా వచ్చేశాము.

ఈ మధ్యనాకు నాన్న వెంట నైట్‌క్లబ్‌లకు వెళ్ళటం అలావాటయిపోయింది. కొందరు మగాళ్ళతో పరిచయం ఏర్పడింది. వైన్, విస్కీ, బ్రాందీ, జిన్, రమ్, బియర్ అన్నీ రుచి చూసేశాను, గాని నాకెందుకో ఏదీ నచ్చలేదు.

మా నాన్నతో అప్పుడప్పుడు అందమైన ఆడవాళ్ళు రావడం ఒకటి రెండు రాత్రిలు వుండి వెళ్తుండటం గమనించాను. నేనాసంగతి ఎన్నడూ అడగలేదు. నాన్నకింకా అరవైయేళ్ళుకూడా నిండలేదు. అమ్మ చచ్చిపోయి ఇరవై ఏళ్ళము ఉంటుంది....

ఒకరోజు నైట్‌క్లబ్‌లో ఒక వ్యక్తితో పరిచయమయ్యింది. అతని మీసాలు చాలా అందంగా వున్నాయి. కూచున్న కాసేపు అతని మీసాలే చూస్తూ కూచున్నా నని చెప్పినా తప్పులేదనుకుంటాను. ఆ మీసాలు సరదాగా వేళ్ళతో తడమాలని పించింది. ఒకకార్నర్‌లో డిమ్‌లైట్‌లో రౌండ్‌టేబిల్ దగ్గిరకూచుని ఏవేవోతిన్నాం. తనే ఆర్డరిచ్చాడు. తింటున్నంతసేపు అతని మీసాలు ఎలా కదుల్తున్నాయో చూస్తూ కూచున్నాను. పై పెదవి మీద బొద్దుగా ఒత్తుగా మీసాల కొనలు రేగి ఎంత అందంగా వున్నాయి.! తింటూ తింటూ మధ్య మధ్య ఆ మీసాలు చేత్తో తమాషాగా మెలి తిప్పేవాడు. ఉంగరంలో వజ్రం తళుక్కు మనేది.

అతను ఎక్కువమాట్లాడే స్వభావంగల మనిషిలాలేడు. ఎందుకనిపించిందో అప్పుడు నా మనసులో ఏ భావాలున్నాయో చెప్పలేనుగాని, అతన్ని మర్నాడు మాఇంటికి రమ్మన్నాను. ఎడ్రెసూ, ఇంటిదారీ, గుర్తులు చెప్పాను.

సరేనన్నట్టు చూసి వెళిపోయాడు, మహేంద్రా జీపు డ్రైవ్‌చేసుకుంటూ.

ఆ రోజు రాత్రి ఎందుకో సరిగ్గా నిద్రపట్టలేదు. పువ్వుల పువ్వుల నైట్ గౌనులో వున్న నన్ను పువ్వులమధ్యవున్న దేవకన్యలా ఊహించుకుంటుటాను. ఒకోసారి ఒంటిమీద బట్టలేవీ లేకుండా దుప్పటి కప్పుకుని పడుకుంటాను-నార్సి జమ్–! నాన్న గదిలోంచి సన్నంగా ఇంగ్లీషు మ్యూజిక్ వినిపిస్తోంది. తోటలో వడ్రింగిపిట్ట చేస్తున్న చప్పుడు....

నేను కాలేజీలో చదువుతున్నప్పుడు మగవాళ్ళు పడిచచ్చేవాళ్ళు.ప్రతిరోజూ నా కారు వెనుక కొన్ని సైకిళ్ళు వచ్చేవి. ఇంటివరకూ దిగబెట్టేవారు. ఎప్పుడన్నా గాలికి పయిట జారితే గిల గిలలాడి చచ్చేవాళ్ళు.

ఒకసారి ఒకబ్బాయి నన్ను రాసుకు రాసుకు తిరగడం ప్రారంభించాడు. చివరికి గుటకలు మింగుతూ "ఐ లౌ యూ"అన్నాడు, భుజంమీద చెయ్యివేశాను. జావగారిపోయాడు."ఏం పెళ్ళిచేసుకుంటావా?"అన్నాను మెలికలు తిరిగిపోయాడు ఆ తరువాత మళ్ళీ కనిపించలేదు.

మగత నిద్ర-పాములు-నిటారుగావున్న చెట్లు-గుర్రపుస్వారి-ఏ తెల్లవారు జామునో-నిద్ర–

మర్నాటి ఉదయం కాఫీ తాగుతుంటే ఇవ్వాళ సాయంత్రం అతన్ని రమ్మన్న సంగతి గుర్తొచ్చింది.అతనిపేరు .. తెలియదు. నా పేరూ అతనడగలేదు. మనిషి బండగా వుంటాడా? మీసాలే బలే అందంగా వుంటాయి.

ఉక్కగావుంది. బయట ఎండ-ఉప్పగాలి–

సాయంత్రం నాలుగు గంటలకే స్నానం చేశాను. నా బాత్‌రూంతో రెండు నిలువుటద్దాలు. ఆ అద్దాల్లో చూసుకుంటూ వొళ్ళు తుడుచుకున్నాను-నార్సిజమ్– నా శరీరం ఇలాగేఉండిపోయి నేనింకో మగాడినయితే-ఈ సౌందర్యాన్ని ఎంతగా ప్రేమించివుందునో. లవెండర్–యుడికోలోన్–బట్టలకు పూర్తిగా నట్టుకోకయినా లేదు. తిన్నగా బెడ్‌రూంలోకొచ్చాడు. ఎంతసేపు అద్దంలో అంతా కనిపిస్తూనే వుంది. సోఫాలో కూచున్నాడు.

హలో అని పలకరించాన్నే నే ముందు.

లైఫ్ తిరగేస్తున్నాడు,

ముస్తాబు ముగించి అతనిముందు కూచున్నాను. ఉల్లిపొరలాంటి తెల్లని చీర కడిగిన ముత్యంలా వుండివుంటాను. అతనొక్కసారిచూసి మళ్ళీ చాలా మామూలుగా పత్రిక తిరగేస్తున్నాడు. Quite a brief look. నన్ను ఇంత దగ్గరగా చూసిన మగవాళ్ళెవ్వరూ నన్నంత నిర్లక్ష్యంగా చూడలేదు.

నాన్న ఇంట్లో లేడు. మంగమ్మ బిస్కట్లు టీ కెటిల్ తెచ్చింది.

బిస్కట్లు తింటూ, టీ తాగుతూ పొడికబుర్లు. కాసేపు వెస్టర్న్ మ్యూజిక్. ఇవతలికొచ్చాం వెలుగు తగ్గుతుంది. అతను జీప్ తియ్యబోతే చెయ్యిపట్టుకొని కారులోకి లాక్కొచ్చాను. డ్రియివర్ని వెళిపొమ్మని నేను డ్రియివరు సీటులో కూచున్నాను. జీపు పొద్దున్న పంపిస్తాన్లే అన్నాను.

చిన్న నవ్వు. నవ్వినప్పుడు వంగేమీసాలు. కారు టౌన్‌హాల్ దాటి సీవ్యూ ముందు ఆపాను. లైట్లు వెలిగాయి. బార్‌లోంచి సీసాలచప్పుడు వినిపిస్తోంది. దూరంగా సూర్యుడు సముద్రంలోకి ఇంకిపోతున్నాడు పక్కనే డాల్ఫిన్స్ నోస్.

కెరటాలు అంతెత్తున ఎగిరిపడుతున్నాయి. గాలి ఉప్పగా వుంది. సముద్రపు ఇసకలో పిల్లలు గెంతుతున్నారు.

కుర్చీలు-ఇతరులకు కాస్తదూరంగా వేయించుకు కూచున్నాము. ఒక బొచ్చుకుక్క మా చుట్టూ గిర గిర తిరిగి వెళిపోయింది. అతను కింగ్‌సైజు సిగరెట్ ముట్టించాడు-ఫోర్ స్క్వేర్.

గాలి బట్టల్లోంచి వొంటినితాకి ఎంతో ఆహ్లాదంగా వుంది. నడుం మీద జాకిట్‌కీ చీరకీ మధ్య ఎవరో చేత్తో నిమిరినట్టయింది. అతనేగా వుననుకున్నాను, కాదు. అతను నాయెదురుగా కదూ కూచున్నాడు. వెన్నులోంని తమాషాగా చలి, మీదకి పాకింది. అక్టోబరు చివరివారం.

సముద్రంలో స్నానం చేద్దామా అన్నాడు. సిగరెట్ పారేసి లేచాడు.

ఇప్పుడా——!అన్నాను ఇసుకలో నడుస్తున్నాము. సూర్యుడు పూర్తిగా అస్తమించాడు. చుక్కలు దొంగచూపులు చూస్తున్నాయి, డాల్ఫిన్స్ మీద లైట్‌హౌస్ వెలుతురు కిరణాలు విసురుతోంది.

అతను కోటు, పాంటూ, షర్టు విడిచి, ఒంటిను అండర్‌వేర్‌తో సముద్రంలోకి నడిచాడు కెరటం వస్తున్నప్పుడు తమాషాగా ఎగురుతూ,చూస్తూ చూస్తూ ఉండగానే చాలాదూరం వెళిపోయాడు. చీకటి ముదురుతోంది. అంతపెద్ద సముద్రం ముందు ఒక్కదాన్ని. సముద్రం గాలికి చలనిపించి అతని కోటు దులిపి వొంటికి చుట్టుకున్నాను. ఎంతబావుంది! అతన్నే వొంటికి చుట్టుకుంటే!?

వచ్చాడు, బాగా దగ్గిరికి వచ్చేవరకూ గమనించనేలేదు. అలసటతో విశాల

మయిన రొమ్ము ఎగిరి ఎగిరి పడుతోంది. రొమ్ముమీద వెంట్రుకల్లోంచి సము ద్రపునీరు బొట్లు బొట్లుగా జారుతోంది. కారు దగ్గరకొచ్చాక టవల్ తీసిచ్చాను. తుడుచుకుని బట్టలు తొడుక్కున్నాడు.

I Love Swimming. I Love the Sea అన్నాడు, తనలో తానే మాట్లాడుకున్నాడు. ఎవరెవరో పలకరించాడు. అతని పేరు సాహి అని తెలిసింది. తెలుగు వాడేనా? తెలుగు ఇంగ్లీషు హిందీ మూడూ బాగా మాట్లాడుతున్నాడు. వచ్చి కూచున్నాడు కుర్చీ పక్కకు జరుపుకుని. గాలికి నా పయిట అతని వొళ్లో పడింది. వంగి అందుకున్నాను, సారీ అంటూ. సముద్రపుగాలి కిత కితలు పెడు తోంది. లాన్‌లో లైట్లువెలిగాయి. నావేపు చూడనయినా చూడలేదు.

రెండు ఓమర్లు జీడి పప్పు వచ్చింది,

తన బీయర్ గబ గబా ఖాళీ చేసి, మరోటి తెప్పించుకుని అదీ తాగేశాడు. నేను చాలా నింపాదిగా తాగుతున్నాను.

మళ్ళీ ఎవరో వచ్చి పలకరించారు, నిలబడి కాస్సేపు మాట్లాడి కూచున్నాడు అతను ఫారెస్టు ఆఫీసరని తెలిసింది.

ఇద్దరం ఇంటికి వెళ్ళేసరికి తొమ్మిది దాటుతోంది.

నాన్న హాల్లో కూచుని వున్నాడు.

"ఈన మిస్టర్ సాహి. ఐ.ఎఫ్.ఎస్ ఫారెస్ట్ ఆఫీసరు. కొత్తఫ్రెండ్---" అని పరిచయం చేశాను నాన్నకి.

నాన్నని అతనికి పరిచయం చేశాను, "మా డాడీ రిటయిర్డ్ మేజర్"

తన జీపు తీసుకుని వెళిపోయేడు. వెళ్లేముందు—"జస్ట్ వన్‌మినిట్ అన్నాడు. దగ్గరికి వెళ్లాను మెడ చుట్టూ చేతులువేసి దగ్గిరికి లాక్కుని ముద్దు పెట్టుకున్నాడు. "థాంక్యు-గూ-నై-" అనుకుంటూ వెళిపోయాడు.

అబ్బ-పెదాలు వూడిపోయాయనుకున్నాను. ప్రాణం జివ్వుమని లాగేసింది ఎంతమోటు మనిషి!

తరువాత పదిరోజులవరకూ కనపడలేదు.

చదివినవే Albert Moravia పుస్తకాలు మళ్ళీ చదువుతున్నాను Conjugal Love, Women in Rome, D.H. Lawrence - Women in Love, Lady Chatterly's Lover. నాకు ఫ్రెంచి చదవడం బాగారాదు. లేకపోతే Gustave Flaubert పుస్తకాలు చదివేదాన్ని. మాట్లాడ గలను. నాన్న నేను, సరదాగా ఫ్రెంచిలో మాట్లాడుకుంటుంటాం.

ఆరోజు గురువారం నాలుగ్గంటలవుతుందనుకుంటాను. పొద్దువాలుతోంది. వచ్చాడు-out of the blue నేను కాఫీ తాగుతున్నాను. పదమన్నాడు. నాన్న

ఇంట్లోలేదు. మంగమ్మతో చెప్పి బయల్దేరాను.

ఎక్కడికో చాలాదూరం నడిపించి జీపు. తలుపు తెరిచేసరికి ఎదురుగా తుపాకి, లేడి చర్మాలు, ఖరీదయిన రోజ్ వుడ్ ఫర్నిచర్-గోడకి పెద్దపులి పెయింటింగ్-గదిలో వస్తువులన్నీ చిందరవందరగా వున్నాయి. టేబిల్ మీద ఫైళ్ళు. డయిరీ-1965 కె.సి. సాహి, ఎమ్.ఎస్.సి. ఐ.ఫ్.ఆర్. పేజీలు తిరగేశాను పాడేరు సమీపంలో మినుములూరు కాఫీ ప్లాంటేషన్‌లో పనిచేస్తున్నాడు. బాంక్ ఎక్కౌంటు నెంబర్లు, లైఫ్ఇన్సూరెన్స్ ప్రీమియంలు, పుట్టినరోజు, పుట్టుమచ్చలు-నాకంటే ఐదేళ్ళు పెద్దవాడనమాట.

కాఫీ పెట్టాడు. అద్భుతంగావుంది.

ట్రాన్సిస్టర్ ఆన్‌చేసి హిందీ పాటలు పెట్టాడు. అతనెవరో తిన్నగా వంట గదిలోకి వెళ్ళాడు వంటవాడయి వుండొచ్చు.

"చాలన్నా. అమ్మగారిక్కడే వుంటారు. వంటవెయ్యి" అన్నాడు.

పువ్వులసిల్కు లుంగీతో,దగ్గిరికివచ్చి దగ్గిరికి లాక్కుని కళ్ళల్లోకి చూశాడు. రక్తం పరుగులు తీసింది. వళ్ళంతా విరుచెమట.

"అరె-వద్దు-వ-"

ట్యూబులైట్ వెలుగుతూనేవుంది. తలుపులు బార్లా తీసేవున్నాయి. అవి చేతులా ఉక్కు కడ్డీలా? నరాలు చిట్లి చచ్చిపోతాను గావును సుఖంతో.రక్తం ఆగి ఆగి ప్రవహిస్తోంది....ఆహ్....

తెల్లవారి లేచేసరికి సాహి కుర్చీలో నిద్రపోతున్నాడు. అతని ఒంటిమీద ఒక తువ్వాలుంది. నా వంటిమీద అదీలేదు. లైటు వెలుగుతూనేవుంది. ఫాను తిరుగుతూనేవుంది, రాత్రి....ఇంత వెలుతురులో....

లేచి చీర చుట్టుకొని బాత్‌రూంకి వెళ్ళొచ్చాను. ఎక్కడా అద్దంలేదు, ఇంటి మొత్తంమీద. శరీరంతో ఇంత గొప్పసుఖం అనుభవించవచ్చని తెలియదు. దగ్గరికివెళ్ళి మీసాలు ఇష్టంగా తడిమాను. గెడ్డం కాస్తపెరిగి పచ్చగావుంది.

అలా నాలుగు రోజులుండిపోయాను. వచ్చిన మర్నాడే నాన్నకు ఫోన్ చేశాను. ఈ నాలుగురోజులూ ఏది పగలో ఏది రాత్రో తెలియదు. నాలుగోరోజు సాయంత్రం ఇంటి దగ్గిర దిగబెట్టి వెళిపోయేడు.

తరువాత చాలారోజులు కనబడలేదు. ఫోన్‌చేస్తే పలకలేదు. వరసగా విందు భోజనాలారగించితరువాత-గంజినీళ్ళుకూడాదొరక్కుండాపస్తులున్నట్టయిందినాపని.

భోజనం చేస్తుంటే ఉత్తరం వచ్చింది.

"డియర్ బ్లూబర్డ్-ట్రాన్స్‌ఫర్ అయింది. కొద్దిరోజుల్లో కలుస్తాను.

విత్ లవ్-సాహి"

అంతే. పోడి ముక్కలు.

నాకు వాంతులు కావడం ప్రారంభమయ్యాయి. నాన్న వచ్చి "షా మి తీ డాక్టరుకి ఫోన్ చెయ్యనా–"అనడిగాడు. నేను మాట్లాడలేదు. సాయంత్రం డాక్టర్, నర్స్ ఇద్దరూ వచ్చారు. నర్సేనాకు ప్రెగ్నెన్సీ అనిచెప్పింది. డాక్టరు మందులు రాసిచ్చాడు.

నాలుగు రోజుల్లో వచ్చాడు. నా ప్రెగ్నెన్సీ సంగతి చెప్పాను. కంగ్రాచ్యులేషన్స్ అన్నాడు చిన్నగా నవ్వుతూ. నాన్నతోచెప్పి అతనితో వెళ్లాను. జాగ్రత్త అన్నాడు. సూట్ కేస్‌లో డబ్బుపెట్టాడు. ఏ అవసరంవున్నా ఫోనుచెయ్యమన్నాడు నేను ఎందుకు వెళ్లేదీ, ఎక్కడకు వెళ్లేది మంగకు తెలీదు.

జీపు నర్సీపట్నం దాటింది. లమ్మసింగి,చింతపల్లి అక్కడ కాస్సేపు ఆగాం. పట్టుపరిశ్రమలో పనిచేస్తున్నతను పాణికి ఫ్రెండేనట. ఆ రాత్రికి సీలేరు చేరుకున్నాం.

సీలేరు హైడ్రోథెర్మల్ ప్రాజెక్టు – నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ దూకుతున్న నీటిహోరు – ప్రాజెక్టుకు కొద్ది దూరంలో కొండవార చిన్న బంగ్లా – చుట్టూ ఆకాశన్నంటే మద్దిచెట్లు – పెరటిచేపు మామిడిచెట్లు –

బాలన్న మాకూడా వొచ్చాడు. చేపలకూర చాలా అద్భుతంగా వండాడు. ఇద్దరం కలిసే భోజనం చేశాం-

పాహికి కాంపులు–రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు రాత్రి పాహి ఇంట్లో లేడు. వరండాలో బాలన్న పడుకున్నాడు.

గుర్రం సకిలిస్తే మెలుకువొచ్చింది.ఎక్కడో వడ్రంగిపిట్ట చప్పుడు చేస్తోంది భయంతోచి బాలన్నను లేపాను. ఏ పులో, ఎలుగుబంటో వస్తే గుర్రం అలాగే సకిలిస్తుందట. ఫరవాలేదు పడుకోమన్నాడు. చుట్టూ పరిహారి, బలమైన తలుపులు భయంలేదు కాని అలవాటులేక భయంతోచింది. పెద్దపులి అరుపులు వినిపిస్తాయేమోనని చూశాను నేను.

తెలతెలవారుతుండగా పాహి లేపాడు నన్ను.

టీ తాగాక–అలా గుర్రపు స్వారీకి వెళదామా అన్నాడు.

ఎలాగ? అన్నాను పొట్టచేపు చూపించి. ఫరవాలేదన్నాడు. జాగ్రత్తగా పట్టుకుని నన్ను ఎక్కించి తానూ ఎక్కాడు.రొమ్ముకు అడ్డంగా చెయ్యివేసి పట్టుకున్నాడు. పల్చని మంచుతెర ఇంకా తొలగలేదు–చెట్ల మధ్యనించి గుర్రం నింపాదిగా నడుస్తోంది.కాస్త భయంగావున్నా, గుర్రపుస్వారీ బాగుంది నేనొక రాజకుమారినయినట్టు,యుద్ధంచేసి గెల్చుకుని నన్ను ఒకరాకుమారుడు తీసుకువెళిపోతున్నట్టు కల-

ఆ రోజు పావురాయి మాంసం వండాడు నేను తినొచ్చో తినకూడదో తెలియదు. నేను ఆమ్లెట్ వేయించుకున్నాను.

"నిన్ను కొండమ్మా అని పిలవాలనివుంది. పిలవనా" అన్నాడు పాహి. భోజనాల దగ్గిర, "నీ ఇష్టం" అన్నాను.

చూడాలనిపించి ఫోన్‌చేస్తే మా నాన్న వచ్చాడు. "ఇక్కడ నీకు తోస్తుందా" అనడిగాడు. "తోచదు నువ్వు కొన్నాళ్ళు ఉండరాదూ" అన్నాను.

పదిహేనురోజులుండి వెళ్ళాడు. తొమ్మిదినెలలు నిండాక ఒకసారి అద్దంలో చూసుకుంటే బాలా బాధకలిగింది. ఎత్తుగా పొట్ట. నల్లబడిన రొమ్ములు బిగుళ్ళు-ఎటు తిరిగిపడుకున్నా ఇబ్బందిగానే వుంటోంది కనడానికి ఎంత బాధపడాలో తల్చుకుంటేనే భయంగావుంది, బాలన్న భార్య వచ్చింది, నాకు సాయం.

ఒకరోజు రాత్రి ఒంటి గంట. పాహి లేడు. నొప్పులు భరించరానినొప్పులు బాలన్న పరుగు పరుగున వెళ్ళి డాక్టర్ని పిలుచుకొచ్చాడు. ఒకటే అరుపులు అరుస్తున్నాను. "సెడటివ్ ఇవ్వండి డాక్టర్, సెడటివ్ ఇవ్వండి" అని అరుస్తున్నాను. డాక్టరు మత్తు మందిచ్చాడు, ఆ తరువాత ఏం తెలియదు. నేను ఎక్కడికో వెళ్ళిపోతున్నాను. లోయలు కొండలు, నీరసం-నీరసం-ఎక్కడికి ఎక్కడికి-తొడల మధ్య వెచ్చగా జిగటగా-ఛి-ఛీ--

పాహి గొంతు వినిపిస్తోంది. రెప్పలు విడపడంలేదు. చచ్చిపోయానా బ్రతికి వున్నానా-అమ్మో-అమ్మ-వద్దు-నొప్పి-నొప్పి బాధ-బాధ-నాన్నా -నే చచ్చిపోతున్నాను-పాహీ, పాహీ-నేన్ .. న్నో -- న్నో --

మగపిల్లాడు పుట్టాడు. ఎర్రితెల్లా వున్నాడు. ఎదురు కాళ్ళని పుట్టాడు. సిజేరియన్‌చైల్డ్-చాలాక్రిటికల్‌కేస్-డాక్టర్లూ, నర్సులూ యువార్ వెరీలక్కీ అన్నారు

బాబునెత్తుకుని పండు మీసాల్లోంచి నాన్న నవ్వుతున్నాడు

వేసవికాలంవచ్చింది. సీలేరు ఆహ్లాదకరంగా వుంది. బాలన్న భార్య తోడుగా ఉంటున్నది. బాబుకు ప్రభాకర్ అని పేరు పెట్టాడు పాహి.

నాలో ఏదో మార్పొచ్చింది..... చంటిబాబుకు పాలిస్తుంటే అదొక ఆనందానుభూతి-అనిర్వచనీయం-

స్నానం చేస్తుంటే చూసుకున్నాను రొమ్ములు జారిపోయాయి. పూర్వపుబిగి లేవు. నడుంకూడా కొస్తలావయింది. పూర్వపు నునుపులేదు. అద్దంమీద ధ్యాసే పోతుంది. పూర్వంకంటే ఇప్పుడే అందంగా వున్నావంటున్నాడు పాహి

భారత్ పాకిస్తాన్ సరిహద్దుల్లో యుద్ధం. ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జై జవాన్ జై కిసాన్ నినాదం ఇచ్చాడు. రేడియో పెడితే యుద్ధవార్తలే.

ప్రభాకర్‌కి నా పోలికలా, సాహి పోలికలా? తెలడంలేదు.

సాహి పూర్వంలా నాతో ఎక్కువ గడపటంలేదు.నాకు బాలాబాధగావుంది. ఆ బాధకి ఏన్నారి ప్రభాకర్ మందు,

ఓవల్టిన్‌తాగి కిటికీ దగ్గర కూచున్నాను. చెట్టుమీద వడ్రింగిపిట్ట ముక్కుతో బెరడు పొడుస్తుంది. ప్రభాకర్ ఉయ్యాలలో పడుకున్నాడు. ఏవేవో ఆలోచనలు ముసురుతున్నాయి. చీకటిపడిన గుర్తుకూడాలేదు. బాబులేచి ఏడుస్తుంటే పాలిస్తున్నాను. పాలపొంగుకు గుక్క తిప్పుకోలేక పొలబారాడు.

బాలన్న పరుగెత్తుకొచ్చాడు. చేతిలో సాహి చొక్కా రక్తపు మరకలు- బాలన్న మాటలు వినిపించడంలేదు. కాళ్ళకింద నేల కుంగిపోతున్నట్టుంది. వెంటనే వెళిపోయాడు తుపాకీ తీసుకుని. బిడ్డను గుండెలకు ఒత్తుకుని నేనుకుర్చీలో అలాగే కూర్చుండిపోయాను. మెదడులో నరాలకు నిప్పంటుకుంది, ఆ వేడి ఒంటినిండా సాకింది. ఇంట్లో ఎవ్వరూలేరు, నేనూ, నా బిడ్డ—

ఏడుస్తున్నానా? బుగ్గలమీద కన్నీరు చారికలు కట్టింది.

నిద్రపోయానా? రెప్పలు అంటుకున్నాయో లేదో తెలీదు-

ఇంటిముందు జీపు చప్పుడు – సాహివచ్చాడు. బాలన్న చచ్చిపోయాడట. సాహి వంటిమీద రక్తపుమరకల్తో పేలికలయిపోయిన బనీను, ఇంచుమించు అదే పరిస్థితిలో కాకీ పాంటూ– వొళ్ళంతా గాట్లు–పులిపంజా దెబ్బలా—? ........ బిడ్డని మంచం మీద వేసి సాహిని గాఢంగా కావలించుకున్నాను. కళ్ళల్లో నీళ్ళు "కొండమ్మా ఏమిటీ కళ్ళల్లో నీళ్ళు నువ్వు ఏడుస్తున్నావా?"

బిడ్డలేచి ఏడుస్తున్నాడు. బాలన్న భార్య నలుగురుపిల్లలూ దిక్కులేని వాళ్ళయ్యారు. బాలన్న ప్రభుత్వోద్యోగికూడాకాదు. సాహిని రక్షించి తను బలైపోయాడు. అంతా చెప్పి, "బాలన్న కుటుంబం దిక్కులేనిదికాదు. పూర్తి సహాయం చేస్తాను. అతని భార్యకు గిరిజన హాస్టలులో వంటమనిషి ఉద్యోగం ఇప్పిస్తాను. పెద్ద పిల్లవాడికి ఫారెస్టు డిపార్టుమెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తాను"–అన్నాడు

కొద్దిరోజులకి నర్సీపట్నం బదలీ అయింది. వెంటనే మకాం మార్చాం.

నాన్న మమ్మల్ని చూడడానికి వచ్చాడు. ప్రభాకర్ తప్పటడుగులు వేస్తున్నాడు. "మీ అమ్మ పారిస్‌లో పుట్టిందిరా-" అంటున్నాడు నాన్న.

తోటలో మద్దిచెట్టుమీద వడ్రింగిపిట్ట చప్పుడు చేస్తున్నది. నా శరీర సౌందర్యం మీద ప్రేమ పెద్దగా తగ్గలేదు.

రచన : ఫిబ్రవరి 1967